


# నెత్తురు కోరని కత్తిపోటు

అది ఓ నగరం.

ఆ నగరానికి చివర్న కోటగోడలా ఓ కొండ. నగరాన్ని కాపలా కాస్తూ ఆ కొండమీద ఓ దేవుడు.

చీకట్లో ఆ కొండమీది నుండిచూస్తే నగరం అంతా ఓ పెద్దనల్ల కేన్వాస్ మీద రంగురంగుల బొట్లు చల్లినట్లు కన్పిస్తోంది.

ఆ కొండ పాదాలదగ్గర చిక్కని చీకట్లో బారులుతీరి తోరణాలు జాలువారుతున్నాయి కాంతిబొట్లు. అవి చుక్కలు కావు. ఎలక్ట్రిక్ బల్బులు. వాటి వెనుక నీలంగా నిగనిగలాడుతున్నది నీలాకాశమూ కాదు— ఫ్లోరిసెంట్ దీపాలకాంతి.

అదీ ఆ నగరంలోని పెద్దమనుషులు, ధనస్వాములూ విలాసించే ఖరీదైన క్లబ్బు. వాళ్లు అక్కడ కూర్చునే చుక్కలకు రెక్కలు కట్టి దింపగలరు. వెన్నెలను వేటాడి అక్కడ చెరపట్టనూ గలరు. కాని

వారంతా శాస్త్ర విజ్ఞానాన్ని సరిగమలుగా సాధన చేస్తున్న ప్రముఖ పారిశ్రామిక వేత్తలు.

వారు—

రోజూ దేవాలయాలకు పోతారు.

దైవ ప్రీతికోసం దానధర్మాలు చేస్తారు. (ఇన్కంటేక్సు ఎగగొట్టటానికని ఎవరైనా అనుకుంటే అనుకోవచ్చు.)

ఆపద మొక్కులు సమర్పించుకుంటారు.

కాని—

కనిపించని దైవం కంటే కనిపించే మానవుడే వారి దృష్టిలో ప్రయోజనకారి. ఆ మానవుడి మేధస్సులో విరిసిన విజ్ఞానాన్ని తూ.చ. తప్పకుండా వాడుకుంటారు. శ్రమని సాక్షీభూతంగా ఆరాధిస్తారు.

క్లబ్ చాలా సందడిగా వుంది.

ట్రేలలో సీసాలు టకటకా దొడ్లుతున్నాయి. ప్లేట్లలో ముక్కలు ఘుమ ఘుమా గుబాళిస్తున్నాయి. సీసాల మూతలు 'చుప్' మని లేస్తున్నాయి. అందులోని ద్రావాలు 'చుయ్యి' మని పొంగుతున్నాయి. గ్లాసుల్లోకి అవి గలగలా పారుతున్నాయి. గ్లాసులు 'టిక్ టిక్' మని చీర్లు కొడుతున్నాయి. ఈ అసంకల్పిత సంగీతానికి సంకల్పిత జాజ్ సంగీతం వంతపాడుతోంది.

ఆ క్లబ్ —

అసహ్యమైన అమ్మాయి జడలో అందమైన పువ్వులా వుంది. అక్కడి వాతావరణం అమెరికా కంటే ఐశ్వర్యంగా వుంది. అక్కడి మనుష్యులు రష్యా సోషలిజంకంటే రవంత పైమెట్టుమీదే వున్నారు.

ఆ క్లబ్ —

ఆనాటి ఆనందానికి నిలయం.

ఐశ్వర్యానికి ఆలయం.

విలాసాలమయం.

ఇన్నిటికీ కారణం ?—

ఆ క్లబ్ రాజపోషకుడు దేశపతిరావు వుత్సాహం.

ఆయన వుత్సాహానికి కారణం ?—

అమెరికానుంచి ఆగమించిన వారి ఏకైక పుత్రుడు కుబేరరావు వురఫ్ ఎన్నార్ కుబేర.

దేశపతిరావుకు దేశానికి అధిపతి కావల్సినంత సంపద వుంది. లోకపతి కావల్సినంత సాహసం వుంది.

కాని—

అవి రెండూ తన కుమార రత్నానికి కావాలనే ఒదిలేశాడు.

తండ్రి తనకోసం, తన ప్రతిభను పరీక్షించటం కోసం ఒదిలేసిన ఆ అపార భవితవ్యాన్ని తరించటంకోసం అమెరికా వెళ్ళి పారిశ్రామిక వ్యవహారాల్లో పారంగతుడై తిరిగొచ్చి, నేడు డాడీ పక్కన ఫుల్‌సూట్లో సాధుపులిలా కూర్చున్నాడు.

డాడీ లేచి గొంతు సవరించుకున్నాడు.

'లేడీసండ్ జంటిల్మన్—'

ఆ ముందున్న వాళ్ళంతా వారి ఆశ్రిత జనమే. అందరికీ వారి వ్యాపారాల్లో మినీ వాటాలున్నాయి.

ఈ మాటతో వారి అరమోడ్పు కన్నులు అతి భారంగా విచ్చుకోగా, చూపులు శబ్దవేదీలా చొచ్చుకొని అటు పయనించి ఆ పక్కనున్న విగ్రహాన్ని స్పృశించాయి. ఆజానుబాహువూ, అరవింద దళాక్షుడూ, తెగతోమిన కంచు విగ్రహంలా తళతళా మెరుస్తున్నవాడూ, ఒత్తయిన జులపాలు చీకటిలా భుజమ్మీటికి జీరాడుతున్నవాడూ దర్శన

మిచ్చి ఈ లోకంలోకి వచ్చారు. అక్కడెందుకున్నారో అప్పటికిగాని వారికి అర్థం కాలా.

'లేడీస్ అండ్ జంటిల్మన్——'

'ఈ రోజు నా కెంతో ఆనందంగా వుంది. కారణం మీ కంద రికీ తెలుసు. చాలాకాలంగా చిరంజీవి కుబేర విదేశాల్లో వుండి, ఇప్పుడు తన మేధస్సును మాతృదేశ కళ్యాణానికి అంకితం చెయ్యటానికి వచ్చాడు. అది సహజమే। ప్రతి దేశభక్తుడికి ఆమాత్రం కోరిక వుండటం అసహజం ఏమీ కాదు. అందుకే నా భారాన్ని, బాధ్యతల్ని పూర్తిగా చిరంజీవికే అప్పగిస్తున్నాను. అతని మనస్సులో ఏవేవో బృహత్ప్రణాళిక లున్నాయి. తన మాతృదేశాన్ని పారిశ్రామికంగా ప్రపంచ పటంలో గుర్తించాలని కలలు కంటున్నాడు. అతని ఆశ లకీ, ఆశయాలకీ నే నెందుకు అడ్డుగా నిలబడాలి? అందుకే రేప ట్నుంచే నా బాధ్యతల్ని చిరంజీవికి అప్పగిస్తున్నాను.

'ఈ సందర్భంలో ఈ రోజు జరిగిన సంఘటన గురించికూడా ప్రస్తావించక తప్పదు. అది మీకు తెలీదనికాదు. చిరంజీవికి మెళ కువ కోసమే చెబుతున్నాను. ఇచ్చేవాడు వెర్రివాడైతే అడిగేవాడి ఆశకు అంతు వుండదు. అది నావిషయంలో అక్షరాలా నిజం అయింది. ఇంతవరకూ నా కార్మికుల కోర్కెల్ని కాదని ఎరుగను. వాటిని ఎప్పుడూ మన్నిస్తూనే వచ్చాను. కానీ, మళ్ళీ ఏవో కనీస వేతనం, రిస్క్ ఎలవెన్సూ అంటూ గోల చేస్తున్నారు. రెండు రోజులనుంచీ ఫేక్టరీ ముందు పికెటింగ్ జరుగుతోంది. నా ఆస్తిని నష్ట పర్చాలనే ప్రయత్నం జరుగుతోంది. అది నేను ఎంతమాత్రం సహించను. ప్రభుత్వమూ, అది నిర్మించిన చట్టమూ ఒకటి వుంది. కాబట్టి పోలీ సులకి తెలియజేయటం జరిగింది. రేపుకూడా ఇలాగే జరిగిందంటే ఇక ఆ అవసరంకూడ వుండదు. ఇవాళ రెండు ప్రాణాలే పోయాయి.

రేపు ఎన్ని పోతాయో నాకే తెలీదు. నా తుపాకీతోటే అందర్నీ మిద తల్లా రాల్చేస్తాను. అప్పుడు.... అప్పుడు ...'

ఆయాసంతో వూగిపోతున్నారు దేశపతిరావుగారు.

'సిట్ డౌన్డాడీ! టేక్ రెస్ట్!!'

తండ్రి భుజాలు పట్టుకుని కూర్చోబెట్టాడు కుమారుడు కుబేర. తను లేచి నిలబడి మైక్ ముందుకు తీసుకున్నాడు.

'నాన్నగారు చాల ఆవేశపడిపోతున్నారు. వారిది చాల సున్నిత మైన హృదయం. ప్రతి చిన్న విషయాన్నీ హి విల్ టేకిట్ సీరియస్. అదికూడా సహజమే. దట్సాల్సో నేచురల్. ఎంచేతనంటే ఫేక్టరీ అంటే ప్రజల ఆస్థి. అది నష్టపోవటం వారికి గిట్టదు. అందుకే ...

* * *

అక్కడ ఫేక్టరీ గేట్లు మూసిఉన్నాయి. గేట్లముందు కార్మికులు పికెటింగ్ చేస్తున్నారు. నినాదాలు ఇస్తున్నారు.

— కార్మికుల కోర్కెలు - తీర్చాలి -

— నిన్న జరిగిన కాల్పులకు - న్యాయ విచారణ జరగాలి -

జనంలో కలకలం రేగింది. తలలన్నీ పైకి లేచాయి. అక్కడ, ఆఫీస్ మేడమీద దేశపతిరావు ప్రత్యక్షమయ్యాడు.

కేకలు, అలజడి, నినాదాలు మిన్నుముట్టాయి.

'సైలెన్స్' గర్జించాడు.

'మీకేం కావాలి? మీ కనీసకోర్కెలు తీర్చటమా? లేక న్యాయ విచారణ జరపటమా?'

'ముందు న్యాయవిచారణ జరిపి కంపెన్సేషన్ ఇవ్వాలి.'

'ఆల్రైట్!'

'తర్వాత కార్మికుల కోర్కెలు మన్నించాలి.

'నో ...'

మళ్ళీ కేకలు, నినాదాలు.

ఒకరాయి పైవరకూ వెళ్ళింది. కాని గమ్యం చేరలేక మళ్ళీ వాళ్ళ మధ్యనే పడిపోయింది.

దేశపతిరావు తుపాకీ తీశాడు. గాలిలో రెండు రౌండ్లు పేల్చాడు.

అలజడి యింకా పెరిగిపోయింది.

ఈసారి ప్రజలవైపు గురిపెట్టాడు.

'స్టాప్ డాడీ, స్టాప్....'

కుబేర వచ్చి తండ్రి చేతుల్లోని తుపాకి లాక్కున్నాడు. దాన్ని అవతలకు విసిరేసి ముందుకువచ్చి నిలబడ్డాడు

'కామ్రేడ్స్ ..'

ప్రజల్లో కలకలం చల్లారిపోయింది.

'కామ్రేడ్స్.... ఇది మీ ఫేక్టరీ. దీనికి యజమానులు మీరు. ఆందోళన ఆపండి. మీకు కావల్సింది మీరు తీసుకోండి. కష్టపడి పని చేయండి. వచ్చిన లాభాలు పంచుకోండి.'

'కుబేరరావు గార్కి'

'జై....'

'కార్మికుల ఐక్యత'

'వర్థిల్లాలి'

'ఇంతవరకూ జరిగింది మర్చిపోదాం. జరిగిందానికి క్షమాపణ నాన్నగారి తరపున నేను కోరుకుంటున్నాను. వారిని క్షమించగలమని మీరనుకుంటే మీ కమిటీ మాతో చర్చలు జరపటానికి రండి.'

మళ్ళీ జయజయ ధ్వానాలు___

* * *

కంపెనీ ఎయిర్ కండిషన్డ్ మీటింగ్ హాల్. గోడలు ఖరీదయిన పెయింట్‌తో ధగధగా మెరిసిపోతున్నాయి. మందకాంతిలో కూడ పొడు గాటి డెకోలామ్ టేబిల్ మీద నీడలు కన్పిస్తున్నాయి.

కార్మిక ప్రతినిధులు కుబేరకు ఎదురుగా కుషన్ కుర్చీల్లో కూరుకుపోతున్నట్టు అనుభూతిపొందుతూ ఒదిగి కూర్చున్నారు. కంపెనీ వున్నతోద్యోగులు ఖరీదైన షూట్లలో చేతులు కట్టుకుని వారిముందు నిలబడ్డారు.

ప్లేట్లనిండా ఫలహారాలు వారిముందున్నాయి. ఆ తర్వాత ఎవ రికి కావల్సిన డ్రింకులు వారి ముందుకొచ్చాయి. ఆ సమశీతోష్ణపు గదిలో వారి ముఖాలు తేటగా, ప్రసన్నంగా వున్నాయి. వారు సాధిం చిన విజయం మహోన్నతమైందనే తృప్తి కార్మికుల్లో వెలిగిపోతోంది.

కుబేర ఫైళ్ళన్నీ విప్పి ముందుపెట్టాడు.

బేలన్స్‌షీట్స్ వాళ్ళముందు పరిచాడు.

'ఇదీ మన ఆదాయ వ్యయాల పరిస్థితి. జాగ్రత్తగా పరిశీలిం చండి.'

'లాభాలు అసలు కన్పించటం లేదు'

అవును. గత సమ్మె ఫలితంగా ఉత్పత్తి పూర్తిగా పడి పోయింది. దానికి తోడు ముడిసరుకు ధర విపరీతంగా పెరిగిపోయింది. వీటన్నిటి మూలంగా ఆదాయం లేకపోగా, నష్టం వచ్చే ప్రమాదం కూడ వుంది. అప్పుడు ఫేక్టరీ మూ సేయాల్సిన పరిస్థితికూడా రావచ్చు.

'ఏమైనా సరే! ఫేక్టరీ మూతపడకూడదు. మేమంతా కష్టపడి

పనిచేస్తాం. మీరు మాతో సహకరించి వుత్పత్తిని పెంచండి' అని హామీ యిచ్చారు కార్మిక నాయకులు.

* * *

మేనేజ్‌మెంటుతో సహకరించి ఫేక్టరీ ఉత్పత్తిని పెంచాలని కార్మికసంఘం తీర్మానించింది.

ఆ తర్వాత—

ఎన్నడూ సమ్మెలు జరగలేదు.

బేలన్స్ షీట్స్ ఎన్నడూ లాభాలు చూపించలేదు.

★